మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి : జిల్లా కలెక్టర్ హైమావతి

**మర్కుక్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):** రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. మంగళవారం మర్కుక్, జగదేవ్‌పూర్‌ల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోగులకు అందుతున్న వైద్య సేవలను, మందులను, పరిసరాలను, ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించడంతో పాటు ఆసుపత్రులకు రోజూ వస్తున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని గర్భస్థ మహిళల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షణ చేయాలని, ప్రతి గర్భిణీ ప్రభుత్వాసుపత్రిలో సాధారణ ప్రసవం జరిగేలా కృషి చేయాలని మెడికల్ ఆఫీసర్ మరియు సిబ్బందిని, ఏఎన్ఎంలను ఆదేశించారు. అన్ని జిల్లా జనరల్ ఆసుపత్రులలో అన్ని సదుపాయాలు కల్పించాలని, ఎక్కడ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే డాక్టర్ మరియు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించారు. ఆసుపత్రుల్లో వైద్య పరికరాలు, మందులు సమకూర్చుకోవాలని, మెడికల్ ఆఫీసర్ నుండి కింది స్థాయి సిబ్బంది వరకు సమయపాలన పాటిస్తూ విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు.

### ప్రశాంతవాతావరణంలో ఎన్నికల నిర్వహణకు

## ప్రతి ఒక్కరూ సహకరించాలి : సిపి రష్మీపెరుమాళ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలోని మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా,నిష్పక్షపాతంగా నిర్వహించడానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా పాటించాలని సీపీ సాధన రష్మీ పెరుమాళ్ సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏదైనా ర్యాలీ లేదా బహిరంగ సభ నిర్వహించాలంటే తప్పనిసరిగా సంబంధిత ఎసిపి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ప్రచారానికి ఉపయోగించే వాహనాలకు ఎసిపికి దరఖాస్తు చేసి అనుమతి తీసుకోవాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఎవరైనా ర్యాలీలు లేదా సమావేశాలు నిర్వహిస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థులు ఎన్నికల నియమాలన, చట్టాలను గౌరవించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలన్నారు.

## ముగిసిన నామినేషన్‌ల ఉపసంహరణ

### -బరిలో 37 స్థానాలకు 174 మంది అభ్యర్థులు

**జహీరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** ఈ నెల 11న జహీరాబాద్ మున్సిపాలిటీకి జరుగనున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు 174 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. ఎన్నికలను పురష్కరించుకుని 227 నామినేషన్లు దాఖలు కాగా ఉప సంహరణ ముగిసాక 174 మంది అభ్యర్థులు పోటీ చేసేందుకు బరిలో ఉన్నారని మున్సిపల్ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ జైత్రం తెలిపారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ నుంచి 37 మంది చొప్పున, బిజెపి నుంచి 27 మంది, సిపిఐ, సిపిఎం, జనసేన పార్టీల నుంచి ఒకొక్కరు ఎన్నికల బరిలో ఉన్నారు. ఎంఐఎం నుంచి పలువురు అభ్యర్థులు, స్వతంత్రులుగా అనేక మంది బరిలో ఉన్నారు.

### రామాయంపేట బరిలో 48 మంది...

**రామాయంపేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈరోజు 19 మంది అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరణ చేసుకోగా మొత్తం 12 వార్డులకు గాను 48 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అందులో కాంగ్రెస్ 12, బిఆర్ఎస్ 12, బిజెపి 12 జనసేన 1, ఇండిపెండెంట్‌లు 11 మంది బరిలో నిలిచారు. ప్రధాన పార్టీలు పోగా మిగతా ఇండిపెండెంట్ అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు గుర్తులు కేటాయించారు.

### మెదక్ మున్సిపాలిటీలో 112 మంది...

మెదక్ మున్సిపాలిటీలోని 32 వార్డులకుగాను 1వ వార్డు ఏకగ్రీవం కాగా మిగతా 31 వార్డులకు మొత్తం 112 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

### అందోలు-జోగిపేట మున్సిపాలిటీ బరిలో 63మంది...

**జోగిపేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో ఎట్టకేలకు ప్రధాన పార్టీల నుంచి టికెట్ల కేటాయింపుకు తెర పడింది. మంగళవారంనాటికి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ చివరి రోజు కావటంతో ప్రధానపార్టీల అభ్యర్థులను ఖరారు చేయటంతోపాటు బిఫారాలు అందచేశారు. అయితే మొదటినుంచి కూడా అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి రెండు వార్డులలో అభ్యర్థుల ఖరారు కొంత ఇబ్బందికరంగా చివరికి ఆ రెండు వార్డులలో కూడా అభ్యర్థులను ఖరారు చేశారు. ముఖ్యంగా ఒకటవ వార్డులో కాంగ్రెస్ పార్టీ నుంచి గడ్డి అరున్‌కుమార్‌కు, 17వ వార్డు నుంచి నేనావత్ మేఘూరాణిలకు చివరకు టికెట్ దక్కింది. ఈ వార్డులో ముందుగా మాజీ కౌన్సిలర్ దుర్గేష్, చందర్ నాయక్‌లకు టికెట్లు ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ మంగళవారంనాటికి అనూహ్య పరిణామాల మధ్య వీరిద్దకీ టికెట్లు దక్కలేదు. వీరిద్దరూకూడా గతంలో బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌పార్టీలో చేరిన తాజా మాజీ కౌన్సిలర్లు. మున్సిపాలిటి పరిధిలో మొత్తం 20 వార్డులుండగా స్వతంత్ర అభ్యర్థులతో కలిపి మొత్తం 63 మంది బరిలో ఉన్నారు. ఇందులో 1వ వార్డు నుంచి గడ్డి అరున్‌కుమార్(కాంగ్రెస్), మన్నె చక్రపాణి(బిఆర్ఎస్), పైతర గారి దుర్గేష్(స్వతంత్ర), 2వ వార్డు నుంచి కొశికె రాజశేఖర్ (కాంగ్రెస్), జిన్నా విజయ్‌కుమార్(బిఆర్ఎస్), ఎర్రగొల్ల అంజనేయులు (స్వతంత్ర), 3వ వార్డు నుంచి అరుణకుమార్ (కాంగ్రెస్), ప్రవీన్‌కుమార్(బిఆర్ఎస్), పులుగు గోపాల్(బిజెపి), కొనింటి శ్రీనివాస్(స్వతంత్ర), 4వ వార్డు నుంచి కుకుంట్ల సంధ్య(బిజెపి), తిరుమల కల్పన(కాంగ్రెస్), మల్కల మాధవి (బిఆర్ఎస్), 5వ వార్డు నుంచి కట్ట అంబేశ్వరి(బిజెపి), కొత్తగొల్ల మాధవి (కాంగ్రెస్), తాలుకా విజయలక్ష్మి(బిఆర్ఎస్), 6వ వార్డు నుంచి కుమ్మరి జ్ఞానేశ్వరి(బిజెపి), రాచకొండ జ్యోతి(కాంగ్రెస్), రొయ్యల నాగరాణి(బిఆర్ఎస్), 7వ వార్డు నుంచి అర్ర వెంకటేశం(బిజెపి), తొట్ల రామక్రిష్ణ(కాంగ్రెస్), మహ్మద్ షకీల్(బిఆర్ఎస్), 8వ వార్డులో బండల సంతోష్‌కుమార్ (కాంగ్రెస్), రాచొకండ నాగరత్నం(బిఆర్ఎస్), 9వ వార్డులో తుపాకుల మీన(కాంగ్రెస్), మహేశ్కర్ పావని(బిజెపి), హన్మంతరావుపేట శోభారాణి (బిఆర్ఎస్), గాజుల ధనలక్ష్మి(స్వతంత్ర), 10వవార్డులో చౌరిగారి విజయ లక్ష్మి(బిఆర్ఎస్), పట్లోల్ల రేఖ(కాంగ్రెస్), 11వ వార్డులో కడాల మౌనిక (బిజెపి), గూడెం కల్పన(కాంగ్రెస్), బీర్ల లత(బిఆర్ఎస్), 12వ వార్డులో అల్లె విద్య(బిఆర్ఎస్), కొరబోయిన సరస్వతి(కాంగ్రెస్),గోపన్‌పల్లి సుజాత (బిజెపి),13వ వార్డులో డాకూరి శివశంకర్(కాంగ్రెస్), పట్లూరి శివశేఖర్ (బిఆర్ఎస్), మ్యాదరి పాపయ్య(బిజెపి), ఆకుల విఠల్(స్వతంత్ర), మోదిని వెంకటేశం(స్వతంత్ర), 14వ వవార్డులో జోగ్యల చంద్రకళ(కాంగ్రెస్), పల్లె నాగజ్యోతి(బిఆర్ఎస్), రుద్రారం సునీత(బిజెపి), చింతకుంట స్వప్న (స్వతంత్ర), పైతరగారి ఉర్మిల(స్వతంత్ర), బుడ్డోల్ల అమృత(స్వతంత్ర), 15వ వార్డులో ఆకుల సత్యనారాయణ(కాంగ్రెస్), మహ్మద్ ఇమ్రాన్ (బిఆర్ఎస్), దుమ్మగల్ల శ్రీకాంత్(బిజెపి), 16వ వార్డులో గాజుల నవీన్ కుమార్(బిజెపి), గాజుల రవికుమార్(బిఆర్ఎస్), పట్లోల్ల శ్రీనివాస్ (కాంగ్రెస్), 17వ వార్డులో కేదావత్ గణేష్(బిఆర్ఎస్), నేనావత్ మేఘూ రాణి(కాంగ్రెస్), 18వ వార్డులో బేగరి శశిరేఖా(కాంగ్రెస్), కట్టెల నాగ జ్యోతి(బిఆర్ఎస్), 19వ వవార్డులో అల్లె మంజుల(కాంగ్రెస్), గడీండ్ల భారతి(బిఆర్ఎస్), రత్నపురి రేఖా(బిజెపి), 20వ వార్డులో సోమిరెడ్డిగారి క్రిష్ణారెడ్డి(కాంగ్రెస్), డి.బి.నాగభూషణం(బిఆర్ఎస్), రుక్మమ్మోల్ల ప్రభాకర్‌గౌడ్(బిజెపి) తరపున అభ్యర్థులు బరిలో ఉన్నారు. అభ్యర్థుల తుదిజాబితా ఖరారవటతో రేపటి నుంచి ప్రచారం ఊపందుకోనుంది

### నారాయణఖేడ్‌లో

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బి ఫారాల పంపిణీ

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఆదేశాలమేరకు నారాయణఖేడ్ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బీఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగృహంలో నిర్వహించగా, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్‌శెట్కర్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, నాయకుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, పీసీసీ సభ్యులు కె. శ్రీనివాస్, శంకరయ్యస్వామి పాల్గొని అభ్యర్థులకు పార్టీ బీఫారాలను అందజేశారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు : 1వ వార్డు - మేటి సంగోండా మాధవి ప్రసాద్2వ వార్డు - సురేఖ విట్టల్3వ వార్డు - మఠం శైలజ ఆనంద్4వ వార్డు - దారం శంకర్ సెట్, 5వ వార్డు - కర్ర మహేష్ చౌహాన్, 6వ వార్డు - భగవాన్ లక్ష్మణ్, 7వ వార్డు - సాగర్ శేట్కర్, 8వ వార్డు - నగేశ్ కుమార్ శేట్కర్, 9వ వార్డు - బాణాపురం రాజు, 10వ వార్డు - ఫర్హానా బేగం, 11వ వార్డు - చీలపల్లి రుక్మిణి గోపాల్ రెడ్డి, 12వ వార్డు - షారుక్ ఖాన్, 13వ వార్డు - వివేకానం, 14వ వార్డు - షాజియా, 15వ వార్డు - అస్మా ఫర్వీన్‌లకు బీఫాంలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖేడ్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాహిర్ అలీ, మాజీ జడ్పీ కోప్షన్ సభ్యుడు రసీద్, బీసీ అధ్యక్షుడు సాయిలు పటేల్ సహ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బీఫాంలు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీలు

## హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

### రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త**
కోతుల బెడద లేకుండా చెయ్యడం అనేది మున్సిపల్ ఎన్నికల్లో ఒక అంశం అని, హుస్నాబాద్ నియోజకవర్గాన్ని కోతులు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. మంగళవారం పట్టణంలో హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల జాబితాను మంత్రి విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో హుస్నాబాద్ మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి 20 మంది కౌన్సిలర్ అభ్యర్థుల పేర్లను ఖరారు చేయడం జరిగిందని, 20 మంది కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. మెజారిటీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపిస్తే భవిష్యత్తులో హుస్నాబాద్‌ను అగ్రగామిగా నిలపడానికి మరింత ప్రోత్సాహం పెరుగుతుందన్నారు. హుస్నాబాద్ ను విద్యా, వైద్య, ఆరోగ్య, పర్యాటక రంగాలతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నమన్నారు. హైదరాబాద్ లో ఉన్న పెద్ద షాపింగ్ మాల్స్ లు హుస్నాబాద్‌కు వచ్చేలా చూస్తున్నమన్నారు. ఏ ఒక్క అంశాన్ని వదిలిపెట్టకుండా అన్ని రంగాల్లో హుస్నాబాద్ ను అభివృద్ధి చేస్తున్నమన్నారు. పదేళ్లలో హుస్నాబాద్ కు ఏమీ చేయని బిఆర్ఎస్ పార్టీ ఏం మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతుందన్నారు. ఇంకా పట్టణ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించే బాధ్యత తనదన్నారు.

తనను ఎమ్మెల్యేగా గెలిపించిన హుస్నాబాద్ ప్రజలు మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా గెలిపించాలన్నారు.మరిన్ని అభివృద్ధి పనులు చేసేలా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.



బీఫాంలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి.

## బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు బి ఫాంలు అందజేత

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** గెలుపు గుర్రాలను రంగంలోకి దించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డిలు మున్సిపల్ ఎన్నికల్లోభాగంగా బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు(కెసిఆర్) ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి బీఫామ్‌లను అందజేశారు. 1వ వార్డు అభ్యర్థిగా ర్యాకల అంజలి గోపాల్, 2వ వార్డు అభ్యర్థిగా మంజుల దుర్గయ్య, 3వ వార్డు అభ్యర్థిగా స్వప్నఅభిషేక్ షెత్కార్, 4వ వార్డు అభ్యర్థిగా అభిషేక్‌షెత్కార్, 5వ వార్డు అభ్యర్థిగా శేఖర్, 6వ వార్డు అభ్యర్థిగా సతీష్ కుమార్, 7వ వార్డు అభ్యర్థిగా విజయ్ బుజ్జి, 8వ వార్డు అభ్యర్థిగా నాగరాజు, 9వ వార్డు అభ్యర్థిగా జ్యోతి సత్యంచారి, 10వ వార్డు అభ్యర్థిగా సనా సుల్తానా సయ్యద్ ఆసిఫ్, 11వ వార్డు అభ్యర్థిగా వర్ష నగేష్, 12వ వార్డు అభ్యర్థిగా పరశురాం, 13వ వార్డు అభ్యర్థిగా మిట్టు, 14వ వార్డు అభ్యర్థిగా అమ్రిన్ ముజామిల్, 15వ వార్డు అభ్యర్థిగా రుబిన బేగం నజీబ్‌లకు బీ ఫామ్‌లను అందజేశారు. ప్రజలు కారు గుర్తుపై ఓట్లువేసి బిఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

## లింగాయవల్లి-చీకోడ్ విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపిక

**పాపన్నపేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** మండల పరిధిలోని లింగాయవల్లి చీకోడ్ ఉన్నత పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు.కామారెడ్డిలో జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పీఎంశ్రీ జెడ్పిహెచ్‌ఎస్ లింగాయవల్లిచీకోడ్ ఉన్నత పాఠశాల విద్యార్థి సుంగా గణేష్ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారు. టీచర్ రాందాస్ ఇతనికి గైడ్ గా వ్యవహరించారు. మారుమూల పల్లెలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల, డీఇఓ విజయ, సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఏఎంఓ సుదర్శణమూర్తి, మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి, హెచ్ఎం దాస్యం విజయలక్ష్మి ఌ అభినందనలు తెలిపారు.



జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థి సుంగా గణేష్



కాంగ్రెస్ అభ్యర్థుల బిఫాంలను ఎన్నికల అధికారికి అందచేస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు

## ఎన్నికల అధికారికి కాంగ్రెస్ అభ్యర్థుల బిఫాంలు

**జహీరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున కౌన్సిలర్‌గా పోటీచేసే అభ్యర్థుల బిఫాంలను ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి అందచేశారు.

## వైద్యులు సమయపాలన పాటించాలి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజు

**చేర్యాల, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజు తెలిపారు. మంగళవారం చేర్యాల పిపియూనిట్, ముస్త్యాల, కొమురవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.ఉద్యోగుల హాజరు పట్టిక, ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల పనితీరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆశ డే కార్యక్రమంలో పాల్గొని సలహాలు, సూచనలు ఇచ్చారు. ఓపిలో నిర్వహిస్తున్న ఆరోగ్య సేవల గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకుని ఫార్మసీ, ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని రికార్డులను పరిశీలించారు. ఎన్‌సీడి కార్యక్రమంలో భాగంగా పరీక్షలు నిర్వహించాలని,వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా పిల్లలకు 100 శాతం టీకాలు అందించాలన్నారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సూపర్వైజర్ స్టాఫ్ మానిటరింగ్ నిర్వహించాలని క్షేత్రస్థాయిలో ప్రజలకు చలి తీవ్రత వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలపైన అవగాహన కల్పించాలన్నారు.ఓపి సంఖ్య పెంచాలని, రక్తపూతలు సేకరించి సకాలంలో టీ హబ్కు పంపించాలన్నారు.మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాలపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులకు ఆదేశించారు. సమయపాలన పాటించని వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు.వారి వెంట డాక్టర్ వినోద్ బాబ్జి,శివీ విదిదీ వైద్య అధికారులు,డాక్టర్ విపిన్ డాక్టర్ ప్రశాంత్ రెడ్డి,వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు,సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి ధనరాజు



ఎంపిడివోతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

### -జిల్లా కలెక్టర్ హైమావతి

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):** మండలంలోని పలు గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను పరిశీలించి ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఎంపిడివో పి.వేణుగోపాల్‌రెడ్డి, హౌసింగ్ డీఈ, ఏఈలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కలెక్టర్ ద్వారా వచ్చిన ప్రొసిడింగ్ లబ్ధిదారులను వెంటనే మార్కింగ్ చేసి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడివోకు సూచించారు. వివిధ గ్రామాల్లో కలెక్టర్‌ద్వారా ప్రొసిడింగ్‌లు వచ్చినప్పటికీ వివిధ కారణాలచే ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించనట్లయితే వారి స్థానంలో నూతనంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు చేపట్టి నిర్మాణాల్లో వేగవంతం చేయాలని అన్నారు. తదనంతరం జగదేవ్‌పూర్ సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్ గ్రామంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుందని, దాని స్థానంలో నూతన వాటర్ ట్యాంక్‌ను నిర్మించేలా చూడాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ స్రవంతి, ఏఈ విశాక, తహసీల్దార్ నిర్మళ తదితరులు పాల్గొన్నారు.

### కెజిబివి తనిఖీ... ఎస్‌వోపై చర్యలకు ఆదేశం...

**మర్కుక్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోగల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, క్యారెట్ కూర, పప్పు, సాంబారు తదితర వంటకాలను తనిఖీ చేసి నాణ్యత ప్రమాణాలపై సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థుల హాజరు ప్రకారం సరుకులు అందుతున్నాయా, కొలతల మేరకు వంట జరుగుతుందా అనే అంశాలపై ఆరా తీశారు. రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలకు వాస్తవ వంటకు అసలు పొంతనలేదని గుర్తించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి ఇష్టానుసారంగా సరుకులు వినియోగించడం ఏమిటని ఎస్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు ప్రకారం వంట చేయకుండా రిజిస్టర్‌లో సరైన నమోదు లేకపోవడంతో ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలని డిఈవోను ఫోన్ ద్వారా ఆదేశించారు. కెజిబివిని తరచుగా తనిఖీ చేయాలని ఎంఈవోకు సూచించారు. రోజు మెనూ పాటిస్తూ విద్యార్థులకు రుచికరంగా వంటలు వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులు కూర్చున్న చోటికే వెళ్లి భోజనం వడ్డించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు విధులను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

### రామాయంపేటలో

## అక్రమ మద్యం పట్టివేత...

**రామాయంపేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** మెదక్ జిల్లా రామాయంపేటలో అక్రమంగా నిల్వఉంచిన మద్యాన్ని స్వాధీనంచేసుకున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు. మంగళవారం నాడు రాత్రి నమ్మదగిన సమాచారం మేరకు పట్టణంలోని మూడవ వార్డు పరిధిలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 23 లీటర్ల (సుమారు 126 క్వాటర్ బాటిళ్లు) మధ్యాన్ని పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మద్యం నిల్వఉంచిన వ్యక్తిపై కేసు నమోదుచేసి, తదుపరి విచారణ చేపడతామని తెలిపారు. కాగా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అక్రమ మద్యం తరలించినా, నిల్వ ఉంచినా చట్టపరమైన కేసులు నమోదుచేస్తామని ఎస్ఐ బాలరాజు హెచ్చరించారు.

## రైలు ఢీకొని యువకుడి మృతి

**జహీరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** జహీరాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో హమాలి కాలనీకి చెందిన రమేష్(30) మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం హమాలి కాలనీకి చెందిన రమేష్ సుభాష్‌గంజ్‌లో హమాలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. నిత్యం మాదిరిగా పనులు ముగించుకుని తన ఇంటికి వెళుతున్న క్రమంలో రైలు ఢీకొని తీవ్ర గాయాలకు గురైన రమేష్‌ను ప్రమాదం గమనించి ప్రజలు రమేష్‌ను పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందచేసి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కానరాని లోకాలకు రమేష్ చేరిపోయాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

## ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనం సీజ్

**కోహెడ, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** నమ్మదగిన సమాచారం మేరకు మండల పరిధిలోని వింజపల్లి గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా బొలెరో వాహనంలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసు మంగళవారం పట్టుకొని సీజ్ చేశారు. టిజి36టిఎ5714 నంబరుగల బొలెర వాహనంలో గీకురు రమేష్ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా వాహనాన్ని పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అభిలాష్ మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్ట పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసిన దృశ్యం

## ముగిసిన ఉపసంహరణ ఘట్టం .. మొదలైన పోరు

### కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు తప్పని రెబల్స్ బెడద.. నాలుగు మున్సిపాలిటీల్లో 72 వార్డులకు బరిలో 326 మంది అభ్యర్థులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలోని సిద్దిపేట మున్సిపల్ మినహాయించి దుబ్బాక, గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్ మున్సిపాలిటీలకు ఈనెల 11 నిర్వహించ తలపెట్టిన ఎన్నికలకుగానూ నామినేషన్లు, ఉపసంహరణ ఘట్టాలు ముగియడంతో బరిలో నిలిచిన అభ్యర్థులు పోరు ప్రారంభించాడానికి సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశించి భంగపడిన ఆశావహులు రెబల్స్‌గా బరిలో నిలిచి కుస్తీ పడుతున్నారు.బిఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు రెబల్స్ బెడద గట్టిగానే తగలడంతో గెలుపొటమిలు ఎలా ఉంటాయోనని ఆయా పట్టణ ప్రజలు చర్చి ంచుకుంటున్నారు.బిఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి టిక్కెట్ దక్కని వారిని పోటీలో నుంచి తప్పించడానికి ఆయా పార్టీల నేతలు విశ్వప్రయత్నాలు చేసిన పోటీ నుంచి తప్పుకోలేదు. మొత్తం మీద ప్రచారానికి సమయం కొద్ది రోజులు మాత్రమే ఉండడంతో అభ్యర్థులు తమ తమ వార్డులో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ప్రచారాన్ని ప్రారంభించారు. కాగా స్వతంత్రులుగా బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులను కేటాయించడంతో వారు సైతం తామేమి తక్కువ కాదన్న రీతిలో ప్రచారం చేయడానికి సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఎన్నికలు జరుగుతున్న నాలుగు మున్సిపాలిటీలో 72 వార్డులకు గానూ మొత్తం 326 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.



చేర్యాలలో బరిలో నిలచిన అభ్యర్థుల వివరాలను నోటీస్ బోర్డుపై అతికిస్తున్న అధికారులు

### చేర్యాలలో...

చేర్యాల మున్సిపాలిటీలో 12 వార్డులకుగానూ బిజెపి, కాంగ్రెస్ 12 వార్డులలో బరిలో నిలవగా బిఆర్ఎస్ ఒక స్థానాన్ని సిపిఎం కేటాయించి 11 వార్డులలో బరిలోకి దిగింది. స్వతంత్రులుగా 5 బరిలో నిలిచారు. సీపీఐ 1, బిఎస్‌పి 1, ఎఐఫ్‌బి 1 చొప్పున బరిలో నిలిచారు. మొత్తం 44 అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

### గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో...

గజ్వేల్ నుంచి 20 వార్డులకుగానూ బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నుంచి టికెట్లు కేటాయించిన అభ్యర్థులు బరిలో నిలువగా బిఎస్పీ 1, సిపిఐ 4, సిపిఎం 1, జనసేన 2, ఇతర గుర్తింపు పొందిన పార్టీల నుంచి 4, స్వతంత్రులుగా 16 మంది బరిలో నిలిచారు. మొత్తం 88 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

### హుస్నాబాద్‌లో...

హుస్నాబాద్‌లో 20 వార్డులకుగానూ బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నుంచి టికెట్లు కేటాయించిన అభ్యర్థులు బరిలో నిలవగా బిఎస్పీ 3, సిపిఐ 4, జనసేన 5, ఎఐఎఫ్‌బి నుంచి 1, స్వతంత్రులుగా 19 మంది బరిలో నిలిచారు. మొత్తం 92 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

### దుబ్బాకలో...

దుబ్బాకలో 20 వార్డులకుగానూ బిజెపి,కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నుంచి టికెట్లు కేటాయించిన అభ్యర్థులు బరిలో నిలువగా స్వతంత్రులుగా 31 మంది బరిలో నిలిచారు. బిఎస్‌పి 1, డిఎస్‌పి 1, ఎఐఫ్‌బి 1, సిపిఎం 3, సీపీఐ 1, చొప్పున మొత్తం 105 అభ్యర్థులు పోటీ పడుతున్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

## క్రీడాకారులకు బహుమతులు ప్రదానం

**బెజ్జంకి, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సిఎం కప్ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు సర్పంచ్ బొల్లం శ్రీధర్ అధికారులతో కలిసి బహుమతులు అందించారు.కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రవీణ్, ఎంఈవో మహతి, ఎంపివో మంజుల, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం తప్పనిసరి : సర్పంచ్



పౌష్టికాహారం అందిస్తున్న సర్పంచ్ బిగుల్ల మోహన్ తదితరులు

**బెజ్జంకి, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త :** గర్భిణీలు, బాలింతాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే ఆహారాన్ని తీసుకొని చంటి పిల్లలకు పోషకాహార లోపాన్ని లేకుండా చేసుకోవాలని సర్పంచ్ బిగుల్ల మోహన్ అన్నారు. మండల పరిధిలోని కల్లెపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణీలు, చంటిపిల్లలకు సర్పంచ్ గుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలల్లో అందించే పౌష్టికాహారం వలన చిన్నారుల శారీరక ఎదుగుదలతోపాటు ఐరన్ లోపాన్ని నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుర్ర శేషి వినీత్, వారునడ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్ అనురాధ, ఆశాకార్యకర్త కవిత పాల్గొన్నారు.

## ఎంపిడిఓకు సమ్మె నోటీసు అందజేత



ఎంపిడివో కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేస్తున్న దృశ్యం

**బెజ్జంకి, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త :** దేశ వ్యాప్తంగా ఈనెల 12న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు తిప్పారపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎంపిడిఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందించి మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకవచ్చిందని దీంతో కార్మిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతుందన్నారు. పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించాలన్నారు. పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత, బీమా, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ కార్యదర్శి శివకుమార్, లక్ష్మణ్, సిఐటియు నాయకులు సంఘ ఎల్లయ్య, బోనగరి లింగం, వినోద్, సంపత్, స్వామి, మల్లేశం, లక్ష్మణ్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

### ఇంటర్మీడియట్ జిల్లా అధికారి రవీందర్‌రెడ్డి



పదవీ విరమణ చేసిన శివరాజ్‌ను సత్కారిస్తున్న దృశ్యం

**కోహెడ, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** పదవి విరమణ ప్రతి ఉద్యోగికి తప్పనిసరి అని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నర్వహించి పదవీ విరమణ పొందిన గౌటే శివరాజ్‌ను మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాలతో ఘనంగా సత్కారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవి విరమణ తర్వాత సేవలు విద్యార్థులకు, సమాజ సేవకు ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ బాలుర కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ యాదగిరి, ఆధ్యాపకులు రాజమౌళి, రాజేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రజిత, నీరజ, సీతా రామయ్య, అశోక్, నరేష్, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్ఎఎస్‌వోలో సివి.రామన్ విద్యార్థుల ప్రతిభ

### 10 మందికి బంగారు పతకాలు

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయిలో నేషనల్ అస్ట్రానమీ అండ్ సైన్స్ ఒలింపియాడ్ (ఎన్ఎఎస్‌వో) ఆధ్వర్యంలో గత డిసెంబర్ నెలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లెవల్-1లో హుస్నాబాద్ పట్టణంలోని సర్ సి.వి. రామన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు 10 మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన వారిలో పెసరు జయ్, బొమ్మగాని ఆయుశ్రీ, గుండు వ్యాసనందన్, కాపర్తి తేజశ్విని, నారాయణపురం రుత్విక, గాడిపె సాన్విశ్రీ, తుమ్మ దృతిక, పోగుల సుహాన్ శౌర్య, గుండు అగస్త్యనందన్, బుర్ర శ్రీనిధిలతో పాటు లెవల్-2లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను భారతదేశంలోని ఇస్రో కేంద్రం సందర్శనతో పాటు అలాగే అమెరికాలోని నాసాకేంద్రానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాయిత నారాయణరెడ్డి మంగళవారం వివరించారు. టాలెంట్ టెస్ట్ లెవల్-1 లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకొని భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షి ంచారు. ప్రతి వ్యక్తి జీవితంలో సైన్స్ కీలక పాత్ర పోషిస్తుందని, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో పెరుగుతున్న విజ్ఞానాన్ని విద్యార్థులు సృజనాత్మకంగా అధ్యయనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు

# బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి : ఎమ్మెల్యే



బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సునీతరెడ్డి తదితరులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి ఇచ్చిన హామీలు పూర్తిగా మర్చిపోయి ప్రజలను మోసం చేసిందని, కాంగ్రెస్‌ను నమ్మవద్దని పేర్కొంటూ ఈ మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే సునీతరెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి సంగీత మల్లేష్, 2వ వార్డ్ అభ్యర్థి హమీద్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ బకాయి కార్డుతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 2 ఏండ్ల పాలనలో అభివృద్ధి సాధించింది ఏమీ లేదన్నారు గత 10 సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులే తప్ప నర్సాపూర్ మున్సిపల్‌కు చేసిందేమీ లేదని ఆమె ఆరోపించారు. నర్సాపూర్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తి చేయలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని దేవ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించుకోవాలన్న లక్ష్యంతో బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాల న్నారు. ప్రజలందరూ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే సునీత రెడ్డి కోరారు. నర్సాపూర్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, సీనియర్ నాయ కులు సింగయపల్లి గోపి, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భోగ శేఖర్, నాయకులు ఆరట్ల మల్లేశం, హనుమంతపూర్ గ్రామస్తులు, సునీత రెడ్డి కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



కళింగ ఫామ్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న తిమ్మాపూర్ గ్రామ ప్రజలు

## గుడ్లఫామ్‌ను మూసివేయాలంటూ ధర్నా

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలో ఉన్న కళింగగుడ్ల ఫామ్‌ను వెంటనే మూసివేయాలని తిమ్మాపూర్ గ్రామ ప్రజలు మంగళవారం ఫామ్ ముందు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి దాదాసు 800 మీటర్ల దూరంలోఉన్న ఈ ఫామ్ ఉండడంతో ఫామ్ నుండి వదులుతున్న వ్యర్థాలవల్ల గ్రామంలో పెద్దఎత్తున దోమలు,ఈగలు పెరిగి విషజ్వరాలు ప్రబలి అనారోగ్యాలకు గురవుతున్నామని, ఈ విషయాన్ని పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా కనీస పారిశుధ్య చర్యలు గ్రామంలో చేపట్టలేదని తెలిపారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడపడేయడంవల్ల ఈగలు, దోమలు పెరుగుతున్నాయని అన్నారు. పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం తింటున్న సమయంలో ఈగలు చుట్టుముట్టడంతో ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి తమ గ్రామాన్ని ఈగలు, దోమల బారి నుండి కాపాడి, కళింగ గుడ్ల ఫామ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు గుండ్రు నర్సింలు, పోసాన్‌పల్లి స్వామి, కొంతం లక్ష్మయ్య, బుచ్చోళ్ల కనకయ్య, బోర్ల కనకయ్య, పోసానిపల్లి కనకయ్య, రమేష్, దండు సత్యనారాయణ, తలకొక్కుల సత్యనారాయణ, గుండ్రు ఉప్పలయ్య, రాచమల్ల శ్రీకాంత్, గుండ్రు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## 9వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తా

### బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి రమేశ్‌గౌడ్



ప్రచారం నిర్వహిస్తున్న బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి పాపగారి రమేశ్‌గౌడ్

**నర్సాపూర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి పాపగారి రమేశ్ గౌడ్ అన్నారు. మంగళవారం 9వ వార్డులో ఇంటింటికి వెళ్లి తన ప్రచారాన్ని సాగించారు. బిజెపిని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా పాపగారి రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నందున అదేవిదంగా ఎంపి రఘునందన్‌రావు సహకారంతో ఈ వార్డు ను అన్ని రంగాలుగాఅభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయిస్తామన్నారు అన్నారు. దీంతో వార్డులో నెలకొన్న ఏ సమస్య అయినా పరిష్కరిస్తానని అదే విధంగా వార్డు ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి పాపగారి రమేశ్‌గౌడ్ అన్నారు. ఈమేరకు బిజెపి పార్టీ అయిన కమలం పువ్వు గుర్తు కు ఓట్లు వేసి తనను భారీ మెజార్టీ తో గెలిపించాలని పాపగారి రమేశ్‌గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలోబిజెపి సీనియర్ నాయకులు రఘువీరారెడ్డి, పెద్ద రమేశ్‌గౌడ్, నాయకులు గుండం శంకర్, రవిబాబు, శ్రీనివాస్‌గౌడ్ , బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి : సర్పంచ్

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** గ్రామంలోని విద్యుత్ సమస్యలను సంబంధిత అధికారులు త్వరగా పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ చింతల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో మంగళవారం విద్యుత్ అధికారులు నిర్వహించిన ప్రజాబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను తీర్చాలని నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో నెలకొన్న పలు విద్యుత్ సమస్యలపై అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎడి శ్రీనివాస్, ఎఈ శ్రీధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ దారంవాణి కిషన్, వార్డు సభ్యులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

## అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా శ్రమిద్దాం

### మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా శ్రమిద్దామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అభ్యర్థులకు మద్దతుగా పలు వార్డులలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వగా, గ్రూపులకు అతీతంగా కష్టపడి పనిచేద్దామని స్పష్టం చేశారు. కులాలు, మతాలకు అతీతంగా అభ్యర్థులను బరిలో దింపగా, 20 వార్డులలో స్థానిక అంశాలపై అవగాహన ఉన్న వారికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధసంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గజ్వేల్ అభివృద్ధికి అవసరమైన నిధులను సిఎం రేవంత్‌రెడ్డి మంజూరు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజల ముందు ఉంచాలని సూచించారు. బిఆర్ఎస్ పార్టీకి ఓటువేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని వివరించారు.

## నర్సాపూర్ బరిలో 63 మంది అభ్యర్థులు

### 36 మంది నామినేషన్ల ఉపసంహరణ

**నర్సాపూర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** ప్రస్తుతం ఈ నెల 11న జరగనున్న నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం అన్నిపార్టీ లతో లకిపి 63 మంది ఎన్నికల బరిలో ఉన్నారని అధికారులు వెల్లడించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయములో జరిగిన అభ్యర్థుల ఉపసంహర ణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమం బాగంగా నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికలలో పరిశీలన అనంతరం 99 మంది అభ్యర్థులు నామినేషన్‌లు వేయగా ఇందులో 36 మంది ఉపసంహరించుకున్నారు. దీంతో 15 వార్డుల్లో 63 మంది కౌన్సిలర్లుగా బరిలో పోటీ పడుతున్నారు. ఈ ఎన్నికల పోటీల్లో ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 15 మంది పోటీలో ఉండగా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు 15 మంది అభ్యర్థులు కాగా బిజెపి తరపున 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాగా ఈ అభ్యర్థులతో పాటు , ఇద్దరు అభ్యర్థులు ఆధార్ పార్టీ తరపున పోటీచేస్తుండగా ఒకరు సిపిఐ, ఒకరు జనసేన పార్టీ, ఒకరు బీఎస్పీ అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. అయితే మిగిలిని స్వతంత్ర అభ్యర్థులు సైతం ఈ ఎన్నికల రంగంలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

## ఆశీర్వదించి గెలిపించండి.. అభివృద్ధిని చేస్తా

### 10వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి కండెల రాజు

**నర్సాపూర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు ప్రజలు నన్ను ఆశీర్వదించి గెలిపించినట్లయితే అభివృద్ధి చేస్తానని బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి కండెల రాజు అన్నారు. మంగళవారం 10వ వార్డ్‌లో పర్యటించి ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా 10 వ వార్డు బి ఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి కండెల రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే సునీత రెడ్డి సహకారంతో 10 వ వార్డులో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నారు. అంతేగాక వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు చేయిస్తానన్నారు. ఈ మేరకు నర్సాపూర్ మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ గా గెలిపించాలని బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి కండెల రాజు కోరారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు రింగుల ప్రసాద్, మాజీ వార్డు సభ్యులు నాగరాజు గౌడ్, శ్రవణ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు



ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి కండెల రాజు

# దురలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

### ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావని





మాట్లాడుతున్న డాక్టర్ పావని

**నర్సాపూర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ దురలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యంపై శ్రద్ధ వహించి జాగ్రత్తలు తీసుకోవాలని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావని అన్నారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, మెదక్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, న్యాయమూర్తి ఎం.హేమలత ఆదేశాల మేరకు మంగళవారం నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఇంటర్నేషనల్ క్యాన్సర్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ పావని, జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ అసిస్టెంట్ గవర్నమెంట్ లీడర్ డి.శ్రీధర్‌రెడ్డి, లీగల్ సర్వీస్ న్యాయవాది సిహెచ్ స్వరూపారాణి, ఆర్ ఎం ఓ డాక్టర్ రాజేష్, లీగల్ సర్వీస్ న్యాయవాది మధుశ్రీ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తగా ఉండాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం కోసం పండ్లు, పండ్ల రసాయనాలు తీసుకోవాలన్నారు. నేటి యువతీయువకులు అత్యధికంగా దురలవాట్లకు బానిసై తంబాకు పాన్ మసాలా మాదకద్రవ్యాలు వాడటం వల్ల నోటి క్యాన్సర్ పలు రకాల క్యాన్సర్ వ్యాధుల మారినపడి తమ ప్రాణాలను కోల్పోతున్నారన్నారు.ఈ వ్యాధి నుండి రక్షించుకోవడం దురలవాట్లను నియంత్రణ చేసుకొని ప్రాణాలను కాపాడుకోవాలని వారు సూచించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధి రాకుండా ఉండటానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వారు తెలియజేశారు. అంతేగాక ప్రతిరోజు వ్యాయామం. యోగాభ్యాసం చేస్తూ ఆరోగ్యవంతులుగా ఉండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డాక్టర్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సరళకుమారి, కవిత, లీగల్ సర్వీస్ సిబ్బంది ఆంజనేయులు, అరుణ, శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది ప్రజలు రోగులు తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న శ్రీనివాస్

## మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

### వీరశైవ లింగ బలిజ సమాజం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

**కొమురవెల్లి, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సజ్జనార్ చేసిన అన్ని పనులను సమర్ధించిన బిఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నేడు అదే సజ్జనార్ చేసిన పనులను విమర్శించడం చూస్తుంటే గురువింద గింజ వైనం సామెత గుర్తుకు వస్తుందని వీరశైవ లింగ బలిజ సమాజం జిల్లా అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి వీసీ సజ్జనార్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. మండల కేంద్రంలోని గౌరవాధ్యక్షులు ఆకుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకప్పుడు సజ్జనార్ డేరింగ్ అండ్ డాషింగ్ డైనమిక్ ఆఫీసర్ అని పొగిడిన వారు నేడు చిల్లర మాటలు మాట్లాడితే సమాజం సహించదన్నారు. జీవన్ రెడ్డి కనీస జ్ఞానం లేకుండా అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. ఆర్మూర్ ప్రజలు గుణపాఠం చెప్పిన జీవన్‌రెడ్డికి బుద్ధిరావడం లేదన్నారు. సమాజహితం కోసం నిజాయితీగా పని చేసే సజ్జనార్‌పై చేసిన వ్యాఖ్యాలు వెంటనే వెనక్కి తీసుకొని బేషరతుగా క్షమాపణ చెప్పాలని లేనియెడల నిరసన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో లింగాయత్‌నాయకులు మహాదేవుని శశికర్,పడిగన్నగారి నాగేష్, పడిగన్నగారి శ్రీనివాస్, మహాదేవుని మనోజ్, కుమారస్వామి పాల్గొన్నారు.

## సిమెంట్ బెంచీల వితరణ

**బెజ్జంకి, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని 9వ వార్డులో మిత్రుల జ్ఞాపకార్థం 8 సిమెంట్ బెంచీలను వితరణ చేసినట్లు వార్డు సభ్యులు ఎల్.వెంకటేశ్ తెలిపారు. రానున్న వేసవికాలం దృష్ట్యా వృద్ధులు, స్థానికులు చెట్ల నీడలో సేదతీర్చడానికి బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటాం



ఎంపిడిఓకు సమ్మె నోటిసు ఇస్తున్న గ్రామ పంచాయతి కార్మికులు

**కొండపాక, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** కార్మికుల, కర్షకుల, ప్రజవ్యతిరేక నల్ల చట్టాలను తీసుకొచ్చి సామన్య ప్రజల జీవితాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అగం చేస్తుందని సిఐటియు జిల్లా నాయకుడు అమ్ముల బాల్ నర్సయ్య అన్నారు. మంగళవారం ఆయన అధ్వర్యంలో ఎంపిడిఓ వెంకటేశ్వర్లకు గ్రామ పంచాయతి కార్మికులు సమ్మె నోటీసును ఇచ్చారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలంటూ ఈనెల 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పంచాయతి కార్మికులు పాల్గొంటారని ఎంపిడిఓకు తెలియజేయడం జరిగిందన్నారు. అయన వెంట గ్రామ పంచాయతి వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి బర్మ కొమురయ్య, మండల ఉపాధ్యక్షులు రమణచారి, నాయకులు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలకు రూ.50వేల విరాళం

**మర్కుక్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ఎర్రవల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ అమర్‌నాథ్, జోషి ఆధ్వర్యంలో ఎర్రవల్లి గ్రామానికి చెందిన అమ్మనగారి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పాఠశాలకు రూ.50వేల విరాళాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటేశం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు దాతల సహకారం ఎంతో అవసరమని, రూ.50వేల విరాళం అందజేసిన లయన్స్ క్లబ్ వారికి పాఠశాల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం దాతలకు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవితరాంమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఓంకార్, రామకృష్ణారెడ్డి, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

### మున్నూరుకాపు మహాసభ పేరుతో

## అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు : ఆకుల రాజేందర్

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** మున్నూరుకాపు మహాసభ కాచిగూడ పేరు చెప్పి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని మున్నూరు కాపు మహాసభ జిల్లా అధ్యక్షులు మహాసభ కాచిగూడ ఈసీ మెంబర్ ఆకుల రాజేందర్ హెచ్చరించారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మున్నూరుకాపు మహాసభ కాచిగూడ పేరుచెప్పి కొందరూ మున్నూరుకాపు సోదరులు ఒక గ్రూపుగా ఏర్పడి అనునిత్యం మేమే మహాసభ జిల్లా ఇన్‌చార్జి అని చెప్పుకుంటూ పబ్బం గడుపుతున్నారని తెలిపారు. రాజకీయ నాయకుల వద్ద పేరు చెప్పి వసూలు రాజాలుగా మారి కులానికి నమ్మక ద్రోహం చేస్తున్నారని పేర్కొన్నారు.మున్నూరుకాపు కులేతర వ్యక్తులకు జీవితకాల సభ్యత్వం కార్డులను ఇస్తూ అక్రమంగా కులంలో భాగస్వామ్యం చేస్తూ కులానికి తీరని ద్రోహం చేస్తున్నారని తెలిపారు. కుల సంఘానికి కట్టుబడి నిజాయితీగా సేవ చేసి మంచి పేరు తెచ్చుకోవాలే తప్ప కులానికి చెడ్డపేరు తేవొద్దన్నారు. సిద్దిపేట పట్టణ మున్నూరుకాపు సంఘంలో జరిగిన ఎన్నికల్లో రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన నీలం యాదగిరి, కమిటీ, సలహామండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రామంచ గ్రామాభివృద్ధికి కృషి : సర్పంచ్



రామంచలో గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** రామంచ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని సర్పంచ్ ఎర్ర భవాని నవీన్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని రామంచ గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్బంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామసభలో గ్రామాభివృద్ధి తాగునీరు, మురికి కాలువల నిర్మాణం తదితర సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగులకు 1వ తేదీన వేతనాలు ఇవ్వాలి

### గుంటుపల్లి సుధాకర్

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):** విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని టిజి యుఈఈయు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటుపల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు రాకపోవడంతో ప్రతి నెలా బ్యాంక్ ఈఎంఐలు కట్టలేక చెక్ బౌన్స్ అయ్యి ఇబ్బందులు పడుతున్నారని, దీనివల్ల క్రెడిట్ స్కోర్ దెబ్బతిని మళ్లీ ఏదైనా అవసరాలు వచ్చినప్పుడు బ్యాంకర్స్ దగ్గరికి వెళ్లి లోన్స్ కావాలన్నప్పుడు క్రెడిట్ స్కోర్ సరిగ్గా లేదు కాబట్టి మీకు లోన్స్ ఇవ్వమని అనడం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు తెలిపారు. 24 గంటలు విద్యుత్ వెలుగునిచ్చే విద్యుత్ ఉద్యోగుల జీవితాలలో జీతాలు సరైన సమయానికి రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

# బీఫాంల పంపిణీలలో నిరసనలు..ఉద్రిక్తత

**జహీరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేసేందుకు నామినేషన్లు వేసిన కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు బి ఫాం సమర్పించేందుకు మంగళవారం ఆఖరి రోజు కావడంతో బి ఫాంలు అందుకోలేకపోయిన అభ్యర్థులు తీవ్ర నిరాశకులోనై నిరసనకు దిగడంతో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉద్రిక్త పరిస్థితలు నెలకొన్నాయి. ఒక దశలో బిఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుతో వాగ్వాదానికి దిగారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు తెలుసుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకుని అభ్యర్తులను అక్కడి నుంచి పంపేశారు.


బిఫాంలో పంపిణీలో ఎమ్మెల్యేతో వాగ్వాదం చేస్తున్న అభ్యర్థులు

**కాంగ్రెస్ పార్టీలోనూ...**

కాంగ్రెస్ పార్టీలోనూ కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు నామినేషన్ వేసిన అభ్యర్థులు బి ఫాంలకు ఎదురు చూసినా ప్రయోజనం లేకపోవడంతో అసంతృప్తితో ఇండిపెండెంట్‌లుగా పోటీచేసేందుకు రంగంలో నిలుచుండిపోయారు. ఇదిలాఉండగా భారతీయ జనతా పార్టీలోనూ బి ఫాంల అందని అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులుగా రంగంలో ఉన్నారు. ఆయా పార్టీలలో బి ఫాంలు అందని అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్తులుగా పోటీచేసి తామేమిటో నిరూపించుకుంటామని అభ్యర్థులు సవాలు చేయడం కనిపించింది.


టేక్మాల్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన జరుపుకున్న దృశ్యం

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**టేక్మాల్, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త:** టేక్మాల్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఒక రోజు తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ప్రతి రోజు పుస్తకాలతో కుస్తీపట్టి చదువుకునే విద్యార్థులు ఉపాధ్యాయులుగా కొలువుదీరారు. జిల్లా విద్యాధికారిగా రేణుక, మండల విద్యాధికారిగా అమీన్, ప్రధానోపాధ్యాయులుగా ఐశ్వర్య, పిఈటిగా వికాస్, ఉపాధ్యాయులుగా శ్వేత వ్యవహరించారు. విద్యార్థులు బోధిస్తున్న తీరు తెన్నులను రాజేంద్రనప్రసాద్ పర్యవేక్షించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదవి అటు తల్లిదండ్రులకు, ఇటు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు బోధన తీరును పరిశీలించారు.

## చేవెల్లలో జొన్న పంట క్షేత్ర ప్రదర్శన


జొన్న పంట క్షేత్రస్థాయి ప్రదర్శన చేస్తున్న వ్యవసాయ అధికారులు

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చేవెళ్లలో ఆహార భద్రత పథకంలో భాగంగా వ్యవసాయ అధికారులు జొన్న పంట క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్బంగా మండల వ్యవసాయ అధికారి రాజేష్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత పథకాన్ని పురస్కరించుకుని సిఎస్‌వి–41 రకం జొన్న విత్తనాలు మన నేల రకాలలో, వాతావరణ పరిస్థితుల్లో, పంట దిగుబడి అంశాలపై ట్రయిల్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీరణ అధికారి రాజు, రైతులు రాయప్ప గారి నర్సప్ప, బోరంచ విఠల్, రాయప్ప గారి మల్లప్ప, బోరంచ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో కుమారుడిని చేర్పించిన ఉపాధ్యాయుడు


ప్రభుత్వ పాఠశాలలో కుమారుడిని చేర్పిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కరస్‌గుత్తి గ్రామంలోగల ప్రాథమికపాఠశాలలో కుమారుడు రిషికుమార్‌ను 1వ తరగతిలో చేర్పించి ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారు. మండల పరిధిలోని పూసలపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్ తన కుమారుడిని స్వగ్రామమైన కరస్‌గుత్తి పాఠశాలలో మంగళవారం చేర్పించారు. ఉపాధ్యాయుడు కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిండంపట్ల గ్రామస్థులు ఆయనను అభినందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే విద్యాప్రమాణాలు మెరుగుపడటం తథ్యమని గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## దర్గాను దర్శించుకున్న ఎంపి సురేష్‌షెట్కార్


జాతరలో దర్గాను దర్శించుకుంటున్న ఎంపి సురేష్‌కుమార్ షెట్కార్

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కొండగట్టుపై గత శుక్రవారం నుంచి కొనసాగుతున్న ఉర్సే షఫీర్ ఫీర్‌గైబ్ సాహెబ్ దర్గా జాతర ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఎంపి సురేష్‌కుమార్ షెట్కార్ జాతరకు చేరుకుని దర్గాను దర్శించుకున్నారు. దర్గాకు దట్టీ కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జాతరను పురస్కరించుకుని మంగళవారం జరిగిన కుస్తీ పోటీల్లో విజేతలకు నిలిచిన ఇద్దరు మల్లయోధులకు 15వేల రూపాయల చొప్పున 30 వేల రూపాలయను మల్లయోధులకు ఎంపి సురేష్‌కుమార్ షెట్కార్ అందచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, న్యాల్‌కల్ సొసైటీ మాజీ చైర్మన్ సిద్దలింగయ్యస్వామి, నాయకులు ఆంజనేయులు, ముంగి శ్రీనివాస్‌రెడ్డి, దర్గా కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి
### డిఇవో విజయ

**పాపన్నపేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** విద్యార్థులు పట్టుదలతో చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో విజయ సూచించారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించారు.విద్యార్థులు నిత్యం పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించా లన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాల న్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ పట్టుదలతో చద వాలని సూచించారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, శివకుమార్, ఉన్నారు.


విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈవో విజయ


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బిఆర్ఎస్ నాయకులు.

## ఖేడ్‌లో బిఆర్ఎస్ పార్టీకి భారీ షాక్
### కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల వేళ నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో బిఆర్ఎస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నాగేష్ షేట్కర్ ఆధ్వర్యంలో, పట్టణంలోని 8వ వార్డు మనసునపూర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు తుకరంతో పాటు ఆయన అనుచరులు సుమారు 25 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కలిసి పనిచేస్తామని నూతనంగా చేరిన నాయకులు, కార్యకర్తలు తెలిపారు.వారితో పీసీసీ సభ్యులు కే శ్రీనివాస్ గారు, రహీం, గౌస్ చిస్తీ, డ్యానియల్, మైపాల్, విట్టల్ తదితరులు ఉన్నారు.

## 5 నుంచి కెసిఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్


కెసిఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బిఆర్ఎస్ నేతలు

**మర్కుక్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):** మాజీ సిఎం కెసిఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 5వ తేదీ నుంచి కెసిఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను మండలకేంద్రమైన మర్కుక్‌లో నిర్వహిస్తున్నట్లు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మర్కుక్‌లో కెసిఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుకు రూ.50వేల నగదుతో పాటు కప్పును, ద్వితీయ బహుమతిగా రూ.25వేల నగదు, ట్రోఫీని అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే బౌలింగ్, బ్యాటింగ్‌లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు నగదుతో పాటు ప్రత్యేక బహుమతులు, ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును కూడా అందజేస్తామన్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు కెసిఆర్ సేవలను గుర్తు చేసుకోవడం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కనకయ్య, రాణి మల్లేశం, బిఆర్ఎస్ బిసిసెల్ మండల అధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్, మాజీ సర్పంచ్ భాస్కర్, ఉపసర్పంచ్ సాయిని మహేష్, నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో కళాజాత

**మర్కుక్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని వర్ధరాజ్‌పూర్, శివారువెంకటాపూర్ గ్రామాల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టిజిబి ఫీల్డ్ ఆఫీసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఖాతాను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని, బ్యాంక్ ద్వారా అందిస్తున్న పలు సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కనకయ్య, కిష్టయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న టిజిబి ఎఫ్ఓ చంద్రశేఖర్


మాట్లాడుతున్న బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి

## ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ సర్కార్
### బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఒక్కొక్కరికి కాంగ్రెస్ సర్కార్ రూ.60 వేలు బాకీ పడిందని బిఆర్ఎస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, నాయకులు ఎల్లు రవీందర్‌రెడ్డి అన్నారు.సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో మంగళవారం బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల బాకీ కార్డులను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి 25 నెలలు కావాస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలను మాత్రం నెరవేర్చడం లేదన్నారు. మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు సూచన మేరకు కాంగ్రెస్ మోసపూరిత విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కంటెం రాజు, నర్సింలు, ప్రభాకర్‌రెడ్డి, పత్రి శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు తీరని అన్యాయం
### కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షులు అత్తు


బిఆర్ఎస్ ధోక చేసిన కార్డులను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన దోకా కార్డులను పంపిణీ చేశారు. బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ బాకీ కార్డుల పేరిట దొంగ నాటకాలు ఆడుతున్నారని వారు ఆడే నాటకాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. పదేళ్ల బిఆర్ఎస్‌పాలనలో రాష్ట్రాన్ని కెసిఆర్ కుటుంబం దోచుకుతిందని ఆరోపించారు. సిద్దిపేట మున్సిపాలిటీలో కోట్ల రూపాయాల అవినీతి జరిగిందని వెంటనే విచారణ చేయాలన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాకి అనంద్, అలకుంట మహేందర్, తప్పెట శంకర్, గయాజుద్దీన్, మధు, హర్షద్, హుస్సేన్, శ్రీకాంత్, రజిని, ఫయాజ్, రఘు, చందు తదితరులు పాల్గొన్నారు. కాగా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నాయకులు ఒకే వార్డులో రెండు పార్టీలకు చెందిన బకాయి కార్డుల పంపిణీలో పోట పోటీగా నినాదాలు చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొనడంతో వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు ఇరుపార్టీల నాయకులను సముదాయించారు.

## ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల అహ్వానం

**కొండపాక, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో 2026, 27లో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ నాగార్జున సాగర్ తెలిపారు. పాఠశాలలో చదవడానికి ఆసక్తి అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 28లోగా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని, లేదా నేరుగా అన్ని ఒరిజినల్ సర్టిపికెట్లతో పాఠశాలకు వస్తే అక్కడ దరఖాస్తు చేయవచ్చని అయన తెలిపారు. ఈ సదవకాశన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకొవాలని కోరారు.

# 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి
### రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్‌గౌడ్


మాట్లాడతున్న రమేష్‌గౌడ్

**మునిపల్లి, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):** కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా లేబర్ కోడ్స్ రద్దు కోసం ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం బుదేరా చౌరస్తాలోని ఆశ్రమంలో మునిపల్లి మండల ప్రజా సంఘాల బాధ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ కార్మిక చట్టాలను, ఉపాధిహామీ చట్టాన్ని, విత్తన చట్టాన్ని, కార్మికులకు కూలీలకు రైతులకు నష్టం చేసే విధంగా మార్పులు చేస్తూ తీసుకువచ్చిన చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 12న దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్మికుల సమ్మెను మండలంలోని అన్ని రంగాల కార్మికులు, కూలీలు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్స్ రద్దు చేయక పోతే కేంద్ర ప్రభుత్వానికి కార్మికులు గుణపాఠం చెప్తారని అన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టాలని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కుల మీద తీవ్రమైన దాడి చేసిందని అన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసిందని అన్నారు.చట్టాలు ఉన్నప్పుడే వాటిని అమలుచేయకుండా యాజమాన్యాలు ఇష్టానుసారంగా శ్రమదోపిడికి పాల్పడ్డాయని చెప్పారు. లేబర్ కోడ్స్‌తో కార్మికులు బానిసలుగా మారే పరిస్థితి వచ్చిందని తెలిపారు. లేబర్ కోడ్స్ యాజమాన్యాల లాభాల కోసమే అని అన్నారు. లేబర్ కోడ్స్ రద్దు కోసం కార్మికుల హక్కుల రక్షణకోసం కనీస వేతనం రూ.20 వేలకు పెంచాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పాత పద్ధతిలోనే కొనసాగించాలని కేంద్ర బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని. విద్యుత్ సవరణల చట్టంను ఉపసంహరించుకోవాలని, రైతులకు నష్టం చేసే విత్తన చట్టాలపై మార్పులను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కుమార్, కులవివక్షత వ్యతిరేక పోరాట సంఘం మండల కార్యదర్శి నగేష్, రైతు సంఘం మండల నాయకులు నర్సింలు, సిఐటియు మండల కార్యదర్శి నర్సింలు పాల్గొన్నారు.

## 'ఇద్దరమ్మాయిలుంటే సుకన్య సమృద్ధిలో చేరండి'

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** ఇద్దరు అమ్మాయిలు (కూతుళ్లు) ఉంటే సుకన్య సమృద్ధి పథకంలోచేరితే ప్రయోజనం పొందవచ్చని మండల పరిధిలోని ముప్పారం అంగన్‌వాడి టీచర్ రమాదేవి సూచించారు. పథకంలో చేరేందుకు ఇద్దరు అమ్మాయిలు 10 సంవత్సరాల లోపు ఉండాల్సి ఉంటుందన్నారు. అర్హత ఉన్న వారు పోస్టాఫీసులో ఖాతా తీసుకుని నెలకు 250 రూపాలయ నుంచి 1,80,000 వరకు కట్టాలన్నారు. చిన్నారులు 18 సంవత్సరాలకు చేరుకున్నాక వివాహానికి లేదా ఉన్నత చదువులకు డబ్బులు ఉపయోగపడతాయన్నారు. పథకంలో చేరేవారు పాన్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, ఇద్దరమ్మాయిల బర్త్ సర్టిఫికెట్‌లతో ధరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పదేళ్ల వయసులోపు ఇద్దరు అమ్మాయిలు ఉంటే పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రమాదేవి సూచించారు.

## అల్లాదుర్గం శివాలయంలో శివస్వాముల రుద్రాభిషేకం

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** మండబల కేంద్రంలోని పురాతనమైన ఈశ్వరాలయంలో శివస్వాములు దుర్గయ్యస్వామి ఆధ్వర్యంలో శివస్వాములు మంగళవారం గణపతి పూజ, రుద్రాభిషేకం, శివస్తోత్రం, పుష్పార్చన, హారతి పూజలు నిర్వహించారు. శివస్వాములు చేపట్టిన పూజా కార్యక్రమాలకు గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు చేరుకుని పూజలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు సదానందం స్వామి, సంగమేశ్వర స్వామి, ఆయా గ్రామాల శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## గోవింద్‌నాయక్ మృతి బాధాకరం : చిలుముల శేషసాయిరెడ్డి

**చిలిపిచెడ్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** చిలిపిచెడ్ మండలం గుజిరితాండ మాజీ సర్పంచ్ ముడావత్ రాకేష్ తండ్రి ముడావత్ గోవింద్ నాయక్ మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిలుముల శేష సాయిరెడ్డి ఆయన పార్థివదేహాని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోవింద్ నాయక్ మృతి బాధాకరమని, రాకేష్‌కు, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సిఎస్ఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ పాఠశాలలో మండల స్థాయి క్రీడాపోటీలు

**కంది, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** మండల స్థాయి సిఎం కప్ క్రీడా పోటీలను మండల కేంద్రమైన కందిలోని మైనార్టీ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. సిఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా కబడ్డీ, వాలీబాల్, కో–కో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ, కంది సర్పంచ్ చిన్నసాయి శ్రీరామ్, ప్రిన్సిపల్ కవిత, పంచాయితీ కార్యదర్శులు, కంది, ఇంద్రకరణ్ పాఠశాలల పిఈటిలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి
### ఎంపిడివో క్రాంతి కుమార్


ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ క్రాంతికుమార్ తదితరులు

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** ఇందిరమ్మ గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో క్రాంతికుమార్ తెలిపారు. మండల పరిధిలోని ఇసుకపాయల తండా పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ క్రాంతికుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లను వేగవంతం చేయాలని, బిల్లులు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, గ్రామకార్యదర్శులు, ఈజిఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ జాకీర్హస్సేన్. సర్పంచ్ కవిత, టీఏ స్వాతి. ఫీల్డ్ అసిస్టెంట్ ప్రవీణ్, నాయకులు రవిందర్నాయక్ తదితరులున్నారు.

## దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకం

**మెదక్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** యువత స్ఫూర్తిదాయకమైన వినూత్న ఆలోచనలు కలిగి దేశాభివృద్ధి, సమైక్యతలో యువత పాత్ర కీలకం అని మెదక్ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ డా, రాజాగౌడ్ తెలిపారు. మంగళవారం చిన్నశంకరంపేటలో ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు చదువు పూర్తయ్యాక భవిష్యత్తులో ఎలాంటిదారిలో వెళితే బాగుపడుతారో వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మహనీయులు అందించిన స్ఫూర్తితో దేశ బలోపేతంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలన్నారు. నేటి యువత ఉద్యోగం కోసం వెతకకుండా, ఉద్యోగాలను సృష్టించి సాంకేతిక పరిజ్ఞానంతో దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కలిసిమెలిసి ఉండాలని, చదువుతో పాటు మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందిచుకోవాలని కార్యక్రమంలో ప్రిన్సిపల్ వాణి, ఉపాధ్యాయులు లింగయ్య, భానుమతి, రేఖ, శివరంజని, అశోక్, వేణు, శ్రీనివాస్, అన్నపూర్ణలు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగుతో మంచి లాభాలు


కాగజ్ మద్దూర్‌లో ఆయిల్ ఫామ్ మొక్కలను నాటుతున్న అధికారులు

**నర్సాపూర్ రూరల్, ఫిబ్రవరి 2,ప్రభాతవార్త:** ఆయిల్ ఫామ్‌లో అంతర పంటల సాగుతో లాభాలు ఆర్జించవచ్చని మండల వ్యవసాయ అధికారి దీపిక అన్నారు. మంగళవారం మండలపరిధిలోని కాగజ్ మద్దూర్ గ్రామంలో పట్లోల్ల శ్యామిందర్‌రెడ్డికి చెందిన 7.20 ఎకరాల వరి క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. మండల వ్యసాయాధికారి దీపిక మాట్లాడుతూ ఈ పంట సాగుకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రూ. 200 ఉన్న మొక్కలను రూ. 20 అందజేయడం జరుగుతుందని, డ్రిప్ సబ్సిడీ ఎస్సీ ఎస్టీ రైతులకు 100గానూ జనరల్ రైతులకి 90 వరకు రాయితీ ఇస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు ప్రోత్సహించే దిశగా రైతు భరోసా తో పాటు ప్రభుత్వం అంతర పంటలు వేసుకోవడానికి ఎకరానికి రూ.2100, ఎరువులకు రూ. 2100 అందిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ పంట వేసుకోవడం వల్ల మంచి రాబడి పొంది రైతులు అభివృద్ధి చెందడానికి వీలవుతుంద న్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మోహన్, దుర్గా ప్రసాద్, రుతు, లీవ్ ఫామ్ రిసోర్సెస్ కంపెనీ టెక్నికల్ పర్సన్ అజయ్ పాల్గొన్నారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

**మెదక్, ఫిబ్రవరి 2,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలో యూరియా కోసం అన్నదాతలు రోడ్డెక్కారు. గవ్వలపల్లికి మంగళవారం ఉదయం యూరియా వచ్చిందని సమాచారం రావడంతో రైతులు పెద్ద ఎత్తున యూరియా కోసం వెళ్లి క్యూ లైన్‌లో వేచి ఉన్నారు. యూరియా కోసం యాప్‌లో బుక్ చేసుకున్నవారికి ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. యాప్‌లో బుక్ చేయడానికి ప్రయత్నించినప్పటికి యూరియా నిల్వ లేదని సమాచారం కనిపించడంతో ఆగ్రహం చెందిన రైతులు అధికారుల తీరును మండిపడుతూ యూరియా ఇవ్వాల్సిందేఅ అని మెదక్–చేగుంట రహదారిపై రస్తారోకో చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవిణ్, ఎస్ఐ నారాయణగౌడ్‌లు సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి యూరియా అందేలా చర్యలు తీసుకుంటామని హామి ఇవ్వడంతో రస్తారోకో విరమించారు. స్మార్ట్‌ఫోన్ లేదని, తమకు యూరియాను యాప్‌లో ఎలా బుక్ చేసుకోవాలో చెప్పాలని అధికారులను రైతులు ప్రశ్నించారు. యూరియా కొరత లేకుండా ప్రభుత్వం చూడాలని రైతులు కోరుతున్నారు.


యూరియా కోసం మెదక్–చేగుంట రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు